క్లుప్తంగా

పీవీ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

మల్కాపురం: పీవీ అంటే సేవా భావానికి నిదర్శనమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో మంగళవారం కార్పొరేటర్ పీవీ సురేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీవీఎస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా సురేష్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, బెహరా భాస్కరరావు, పలు వార్డుల కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్ నగర్ సర్వీసురోడ్డులో మంగళవారం స్థానిక నాయకులు చికెన్ శ్రీను, వై.అశోక్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యకర్తలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులకు,వాహనదారులకు మజ్జిగ,మంచినీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,స్థానిక నాయకులు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద్‌కు బంగారు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వరప్రసాద్

కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన జైభీమ్ దిశా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, సోషల్ వర్కర్ డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌ను బంగారు నంది అవార్డు వరించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ జాతీయ చైర్మన్ వి.ఆర్.శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ బంగారు నంది అవార్డ్స్–2023 ప్రదానోత్సవంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ సామాజిక, కళా, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. రాష్ట్ర తెలుగు, సంస్కృతి అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. తన సేవలకు గుర్తింపుగా వచ్చిన అవార్డుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన బెహరా



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసిన బెహరా భ్కారరావు

గోపాలపట్నం: నూతనంగా బాధ్యతలు తీసుకున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను మంగళవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందించారు. జీవీఎంసీ 91, 92 వార్డు పరిధిలోని దీర్ఘ కాలిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ.. అంతంత మాత్రం

- జోన్–5లో డస్ట్‌బిన్ల కొరత
- తుప్పుపట్టిన చెత్త డబ్బాలే దిక్కు
- మెరుగైన పారిశుధ్యంపై అధికారుల అశ్రద్ధ



రక్షణగిరి రోడ్డులో పాడైన డస్ట్ బిన్ వద్ద చెత్తకుప్ప(ఫైల్)



దుర్గానగర్‌లో మూలకు చేరిన వీల్ బిన్స్



56వ వార్డులో తుప్పుపట్టిన పుష్‌కార్ట్‌లు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. జోనల్ కార్యాలయ పరిధిలో పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. అధికారుల అశ్రద్ధతో పారిశుధ్య పనులు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రజారోగ్యానికి సంబంధించి పారిశుధ్య సిబ్బంది కొరత కంటికి కనిపిస్తున్నా.. జీవీఎంసీ పాలకవర్గం కొత్త వారిని నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డుకు సంబంధించిన పారిశుధ్య సిబ్బందితో మొత్తం పనులు చేయించి సరిపెడుతున్నారు. అంతవరకు ఎలా ఉన్నా.. పారిశుధ్య సామగ్రి విషయంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి బయటపడుతోంది. ఒక్కో వార్డుకు సంబంధించిన పారిశుధ్య సిబ్బందితోపాటు తడి, పొడి చెత్త సేకరణ నుంచి కాలువలు, గెడ్డల్లో పూడిక తీసే వాహనాలు తుప్పుపట్టి మూలకు చేరాయి. ప్రధాన రహదారుల్లో డంపర్ బిన్లు, వీధుల్లో పుష్‌కార్ట్‌లు పాడై నిర్లక్ష్యంగా రోడ్డున పడ్డా.. వాటికి మరమ్మతులు చేయించే నాథుడు కనిపించడం లేదని జోన్ ప్రజలు ఆరోపిస్తున్నారు.

వీధులు, రహదారుల్లో చెత్తకుప్పలు..

ఒక్కో వార్డుకు సంబంధించి కాంపాక్ట్ బిన్లు(6), డంపర్ బిన్లు(8), పుష్‌కార్ట్‌లు(ఫోర్ బిన్లు)(12)–(రెండు బిన్లు)(8), వీల్‌బార్స్(10) ఉండాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరిస్తుండటంతో వీటిని అంతంత మాత్రంగానే వినియోగిస్తుండటంతో సంఖ్య తగ్గింది. కొత్త వాటి జాడలేకపోయిన ఉన్న బిన్లు తుప్పుపట్టి మూలకు చేరాయి. దీంతో వీధులు, ప్రధాన రహదారుల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో చెత్తాచెదారం దర్శనమిస్తోంది. పాడైన పుష్‌కార్ట్‌ల్లో చెత్త వేయడంతో వీధులు అధ్వానంగా మారుతున్నాయి. జోనల్ కమిషనర్ స్పందించి ఆయా వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని జోన్ ప్రజలు కోరుతున్నారు.

కొత్త వాటికి టెండర్లు పిలిచాం



జోన్–5కు సంబంధించిన వార్డుల్లో తుప్పుపట్టిన డస్ట్ బిన్లను తొలగించాలని స్పందన కార్యక్రమంలోనూ, వార్డు పర్యటనల్లో నా దృష్టికి వచ్చింది. టెండర్లు పిలిచి కాంపాక్ట్ బిన్లు, పుష్‌కార్ట్‌లు, డంపర్ బిన్లు, వీల్‌బిన్లు కొత్తవి తయారు చేయిస్తున్నాం. పనులు పూర్తయితే వార్డు జనాభా ఆధారంగా పంపిణీ చేస్తాం. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు శానిటరీ అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్నాం.

–ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

సంక్షేమ సారథికే మళ్లీ పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి పిలుపు
- 61వ వార్డులో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రం అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఒక ప్రాంతం కాదు.. రాష్ట్రం మొత్తం మీద ఏ గడప తట్టి అడిగినా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అందుకున్నామని చెబుతారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో గాంధీజీవీధి సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కులం,మతం,ప్రాంతం,పార్టీ చూడకుండా అర్హులందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు తలుపు తట్టి అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీ నాయకులు ఇంటి పట్టాలు ఇస్తామని, పింఛన్ల కోసం ఓ రేటు పెట్టి ఏవిధంగా ఇబ్బంది పెట్టారో ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నేడు పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారుల వ్యక్తి గత ఖాతాల్లోకి పథకాల మొత్తం జమ అవుతుందన్నారు. నమ్ముకున్న ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం.. అదే జగన్‌మోహన్‌రెడ్డి తనను నమ్ముకున్న వారి కోసం ఎంతటి కష్టమైనా మాట నిలబెట్టుకుంటారని వివరించారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అంతా ఆశీర్వదించాలన్నారు. ప్రజలకు మంచి చేసే నాయకుడు మీ వెంట ఉంటే మీ కుటుంబాలు ఎప్పుడు చిరునవ్వులతో కళ కళలాడుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పిలక రామోహన్‌రెడ్డి,దాడి సత్యనారాయణ,బూస అప్పలరెడ్డి,నూకరెడ్డి,వరలక్ష్మి,మంగ,చట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



బస్ స్టాప్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులోని చేపట్టిన పలు అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం డీఈ ఏడు కొండలుతో కలిసి పర్యటించారు. జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థల పరిశీలన చేశారు. త్వరలో ఈ పనులకు శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ.9లక్షలు వెచ్చిస్తున్నామని పేర్కొన్నారు. హిందూ క్రిస్టియన్ ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు సుమారు రూ.3 కోట్లతో చేపడుతున్నట్టు చెప్పారు. ఇక్కడ గెడ్డ రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొత్త కరాసా, పాతకరాసా గణేష్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కరాసా, గణేష్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు జియ్యాని చెప్పారు. కరాసాలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి రూ.19లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే అవసరమైన చోట్ల రహదారులు, కాల్వల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవిత చరమాంకం వరకూ జగన్‌మోహన్‌రెడ్డితోనే..

- ఎదుగుదల చూసి ఓర్వలేకే దుష్ప్రచారం
- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



గోపాలపట్నం: రాజకీయంగా తన ఎదుగుదల చూసి ఓర్వలేక కొంత మంది తాను పార్టీ మారుతానని దుష్ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో తన సామాజిక వర్గాన్ని వాడుకుని పార్టీ మారుతున్నానని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది కొందరు ఉద్దేశ పూర్వకంగా చేస్తున్న పని అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తాను మొదటి నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడిగా ఉన్నానని తెలిపారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానిగా కొనసాగుతున్నానని పేర్కొన్నారు. ఇది తన జీవిత చరమాంకం వరకు కొనసాగుతుందని జియ్యాని స్పష్టం చేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి డిప్యూటీ మేయర్ చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ద్రోహం చేయబోనని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని తెలిపారు. చాలా మంది ఆశ్చర్యంతో ప్రశ్నించడంతో తనకు దుష్ప్రచారం గురించి తెలిసిందని పేర్కొన్నారు. తనను పార్టీ పెద్దలు అపార్థం చేసుకునే విధంగా పక్కా ప్రణాళికతో చేస్తున్న చర్య అని ఖండించారు. అక్కసుతో చేస్తున్న ప్రచారాలను పార్టీ కార్యకర్తలు ఎవరూ నమ్మవద్దని జియ్యాని కోరారు.

మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన హర్షవర్ధన్ రెడ్డి

ఏయూక్యాంపస్: మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ పెరుగుతోందని జగనన్న సచివాలయం, గృహ సారథి ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వివరాలు వివరించారు. తొమ్మిది రోజులుగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజాస్పందన పెరుగుతోందని వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ పేర్రాజు



మాట్లాడుతున్న ఏపీజేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు

మహారాణిపేట: జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల కార్యాచరణ సమితి(అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌జీవో హోంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి.. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరావతి జేఏసీ కో–చైర్మన్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ త్రినాథరావు, ఏపీ భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమూర్తి, ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శారదారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత కోచింగ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కృష్ణారావు, విద్యార్థులు

కంచరపాలెం: కంచరపాలెం బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ బుధవారం నుంచి పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)–2023కి ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారావు తెలిపారు. కార్యాలయ భవనం వద్ద మంగళవారం ఉచిత కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామని, ఉత్సాహవంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 98665 62778 నంబర్ ద్వారా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నిధులు కేటాయించాలని వినతి



ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లావణ్య

మల్కాపురం: వార్డు పరిధిలోని గెడ్డల ఆధునికీకరణతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు,సీసీ కాలువల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య వినతి పత్రం అందజేశారు. ఆనంద్‌కుమార్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి పలు అంశాలను వివరించారు. స్పందించిన ఆయన అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు గులిగిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



ఎన్ఏడీలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న సీఐ అప్పారావు

గోపాలపట్నం: కంచరపాలెం, ఎన్ఏడీ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కంచరపాలెం పోలీసులు విస్తృతంగా చేపట్టారు. ఇప్పటి వరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 40 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఇందులో 19 మందిని కోర్టుకు తరలించామని పేర్కొన్నారు. వీరికి రూ. 39వేలు జరిమానా విధించారని తెలిపారు. తనిఖీలు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, ఎన్ఏడీ కూడలి, బిర్లాజంక్షన్, ఎన్ఎస్‌టీఎల్ కూడలి ప్రాంతాల్లో నిర్వహించామని తెలిపారు. ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికే ప్రజల మద్దతు



పద్మనాభనగర్‌లో ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 92వ వార్డు పద్మనాభనగర్‌లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి ఆయన వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఏవిధంగా నెరవేర్చకుండా మోసం చేశారో వివరించారు. అనంతరం ప్రజల మద్దతు పుస్తకంలో 5 ప్రశ్నలను బెహరా అడిగి వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, సచివాలయ కన్వీనర్ సాలాపు మారయ్య, తొంతిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంచుమాంబ పండగ



కుంచుమాంబను దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: యల్లపువానిపాలెం గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. యల్లపువానిపాలెం, చంద్రనగర్, ఖార్వెల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, సంతోష్‌నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మజ్జిగ, తాగునీరు అందించారు. సాయంత్రం పురవీధుల్లో ఘటాలు ఊరేగించారు. గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరస వద్ద జనంతో సందడి వాతావరణం నెలకొంది.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు..

కుంచుమాంబ అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, వైఎస్సార్‌సీపీ 89వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ తదితరులు దర్శించుకున్నారు. వారికి అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

సత్తాచాటిన ఏఎంసీ జట్లు

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్‌సైన్సెస్ అంతర కళాశాలల గేమ్స్ పోటీల్లో ఏఎంసీ ఫుట్‌బాల్, టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఈ పోటీలు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్టుకు రాహుల్, బాల్ బ్యాడ్మింటన్‌కు శంకర్, టెన్నిస్ జట్టుకు ,ఆదర్శ్ కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ మన్మథరావు, రాజేంద్రప్రసాద్ ఆయా జట్లను అభినందించారు.

2 కేజీల గంజాయి స్వాధీనం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. బర్మా క్యాంప్‌కు చెందిన రాయ సత్యనారాయణ మంగళవారం 2 కేజీల గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు కైలాసపురం మధుసూదన్‌నగర్ వద్ద కంచరపాలెం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుండి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న 'షేడ్స్ ఆఫ్ వైజాగ్'



పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న సీఎండీ హేమంత్



పెయింటింగ్స్‌ను ఎగ్జిబిషన్‌ను సందర్శించిన సందర్శకులు

బీచ్‌రోడ్డు: మన సంప్రదాయలు, సాంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్ యార్డ్ సీఎండీ హేమంత్ తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటిష్ వారి అరాచక పాలనను చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. ఆర్టిస్ట్ నరేష్ మెహతా మాట్లాడుతూ వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన బుధ, గురువారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. హవామహల్ రాజమాత మయంక్ కుమారి దేవి తదితరులు పాల్గొన్నారు.

అంతర విభాగాల ఫుట్‌బాల్ విజేత మెకానికల్ జట్టు



విశాఖ స్పోర్ట్స్: ఈకోర్‌రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రైల్వేఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆపరేటింగ్ జట్టుపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో ఆపరేటింగ్ జట్టు టీఆర్‌డీ జట్టుపైన, మెకానికల్ జట్టు సివిల్ ఇంజినీరింగ్ జట్టుపైన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రికెట్ నాకవుట్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు 56 పరుగుల తేడాతో సిగ్నల్స్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. మెకానికల్ జట్టు ఐదు వికెట్లకు 177పరుగులు చేయగా సిగ్నల్స్ టెలికాం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది.